
# నీకెందులకోయూ కలవరమూ...

-సుగుణ



మీకీ సంగతి ఇప్పుడు చెప్పకపోతే ఎప్పటికీ చెప్పలేనేమో! అసలిటువంటి పని ఇంకెవరైనా చేశారని నా దృష్టికి కానీ వచ్చి ఉంటే వాళ్లని క్షమించగలిగేవాడినే కాదు. మధుమిత పట్ల నేను చేసిన ఘోరమైన అన్యాయానికి నేనుపడే క్షోభే నాకు తగినశిక్ష అని మీరనవచ్చు. 'ఇంత తీవ్రమైన ప్రతీకారేచ్ఛ గల నీవంటి ముసలాడికి ఇలా కావలసిందే' అని అనుకోనూవచ్చు.

అన్నిటికన్నా నన్ను ఇప్పుడు కలవరపరుస్తున్న విషయం ఏమిటంటే ఆ రాత్రి తర్వాత నా మిత్ర బృందం నన్ను పూర్తిగా వెలివేశారు. 'శ్రీ నృసింహ భూపతిరాజా' అనగానే నేను నిర్వహించే కవి సమ్మేళనానికి ఇతర కార్యక్రమాలన్నీ మానుకుని హాజరయ్యే నా స్నేహితులెవ్వరూ ఇప్పుడు ఇంటి ఛాయలకు కూడా రావడం లేదు. నా ఇంట జరిగే కవి సమ్మేళనాలు ఎంత ప్రసిద్ధి చెందినవో చుట్టుప్రక్కల ఎవరిని అడిగినా చెబుతారు. ప్రతిభావంతులనీ, పేరు పొందిన కవులనీ, కవయిత్రులనీ ఆహ్వానించి వారికి ఘనమైన పారితోషికాలిచ్చి సన్మానించడం నా జీవన శైలిలో ముఖ్యాంశం.

నా ధనం, నలుగురినీ పోగేయగల ఆకర్షణ శక్తీ, ఉదారబుద్ధీ వీటన్నిటినీ విచ్చుకత్తుకింద జమకట్టి నన్నే ఉన్నతస్థానంలో నిలబెట్టి 'మహారాజ పోషకుడు' అని బిరుదిచ్చిన నా ప్రియమిత్రులకి నేనొక జిత్తుల మారిగా కనిపిస్తున్నానిప్పుడు.

మా తాత ముత్తాతలు నాకొదిలిన ఆస్తిపాస్తులు ఇంకో ఏడుతరాలకి సరిపడా ఉన్నాయి. నేను పెళ్లి చేసుకోలేదు. అలాగని స్త్రీలు నా పట్ల ఆకర్షితులు కాలేదని అనుకోకండి. వివాహం అంటే నాకు విముఖత ! అంతే! బాధ్యతలేవీ వహించకుండా ఒళ్ళో సుఖాలొచ్చి పడిపోతూ, జీవితం సాఫీగా సాగిపోతూంటే స్త్రీలూ ఈ విషయంలో నాతో పూర్తిగా ఏకీభవిస్తారు. అందరికీ ఆమోదకరమైన ఏర్పాటు మాది.

అసలిదంతా ఇలా జరగడానికి కారణం గిరిజాదేవి పన్నిన జాలంలో నేను చిక్కుకుపోవడమే. ఆ మధ్య నా జన్మదినవేడుకలు భారీయెత్తున జరుపుకుని అందరినీ సాగనంపి లోనికి వచ్చి చూసేసరికి గిరిజాదేవి ఒక మూల సోఫాలో తలకిందికి వేలాడేసి లేవలేని స్థితిలో కనిపించింది.

ఇటువంటి సమయాల్లో స్త్రీలనైనా, పురుషులనైనా భద్రంగా ఇంటికి చేర్చే బాధ్యత గృహస్థుదే. గిరిజాదేవిని మెల్లిగా లేవనెత్తి కారులో కూచోబెట్టి, ఆమె ఇంటికి తీసికెళ్లి పడకగదిలో మెత్తలూ, పరుపులూ సరిచేసి జాగ్రత్తగా పడుకోబెట్టి వచ్చేయబోయాను. ఇంతలో నా చేయి పట్టుకుని పక్కమీదకి ఓ గుంజు గుంజింది.

''కూర్చో సింహం! పానీయం తీసుకుందాం'' అంది. మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి. నా మిత్రులంతా నన్ను 'సింహం' అని సంబోధిస్తారు. 'శ్రీనృసింహభూపతిరాజా' అనే రాజసంతో కూడిన పిలుపు నన్ను వాళ్లకి దూరం చేయవచ్చుననే భయంతో నేనే వాళ్లకి అలవాటు చేశాను. నా మిత్రులే నా జీవితం అని ముందే చెప్పానుగా!

రెండుపాత్రల్లో ఎర్రని పానీయం నింపి, తానొకటి తీసుకుని నాకొకటి ఇచ్చి గిరిజాదేవి తిరిగి పక్కమీద బాలీసులకానుకుని మఠం వేసుకుని కూర్చుంది. నేను మౌనంగా పరుపు అంచున కూర్చున్నాను. పొట్టిగా స్థూలంగా ఉన్న ఆమె పక్కన నేను నిలబడితే కుర్చీమీద నిలబడినట్లుంటుంది. కూర్చున్నా పెద్దతేడా ఏమీ కనిపించలేదు.

ఇటువంటి సమయాల్లో స్త్రీలనైనా, పురుషులనైనా భద్రంగా ఇంటికి చేర్చే బాధ్యత గృహస్థుదే. గిరిజాదేవిని మెల్లిగా లేవనెత్తి కారులో కూచోబెట్టి, ఆమె ఇంటికి తీసికెళ్లి పడక గదిలో మెత్తలూ, పరుపులూ సరిచేసి జాగ్రత్తగా పడుకోబెట్టి వచ్చేయబోయాను. ఇంతలో నా చేయి పట్టుకుని పక్కమీదకి ఓ గుంజు గుంజింది.

పెదవులకి పాత్ర నానించుకుని దానిపై నుంచి నా వంక చూస్తూ

''అమర్‌దీప్ సంగతి నీకు తెలుసా?'' అంది గిరిజాదేవి.

''ఎవరూ? తెలుగులోనూ, బెంగాలీలోనూ కవితలు రాస్తాడూ అతనేనా? క్రిందటి ఏడాది అతనికి ప్రభుత్వం బిరుదులిచ్చి సత్కరించిందేమో. ఈసారి మనింటికి పిలవాలి'' అన్నాను.

'నా ఇల్లు' అని సన్నిహితులతో వ్యవహరించను.

''అయినా అతని కవితలు నీకేం బోధపడతాయిలే'' అన్నాను వినీవినపడకుండా.

కవిత్వమంతా ఔపోసన పట్టేసిందని గిరిజాదేవికి భ్రమతో కూడిన గర్వం.

''ఏమిటీ అంటున్నావూ'' అంది గిరిజాదేవి.

''అదే అమర్‌దీప్ సంగతేమిటీ అంటున్నాను'' అన్నాను.

''ఒక రసవత్తరమైన విషయంలే'' అంది నాతొడమీద మెల్లిగా చూపుడువేలుతో రాస్తూ.

నాకా స్పర్శ కంపరమెత్తిస్తున్నా సహజమైన కుతూహలం జయించి,

''ఏమిటో చెప్పుమరి'' అన్నాను.

ఆమె వేలితో నావేలు మెలిపెడుతూ ఈ విధంగానైనా కంపరం తగ్గుతుందేమోనని.

గిరిజాదేవి ఈచర్యకి వేరే అర్థం కల్పించుకుని ఇంకా దగ్గరికి జరిగింది.

''అమర్‌దీప్ చేత మా మహిళాసంఘంలో కొందరు తమ మీద కవితలు రాయించుకుంటున్నారు''

''తమని ఇతరులు పొగిడితే మీ స్త్రీలకో ఆనందం. ఇందులో విశేషమేముంది?''అన్నాను తేలిగ్గా.

''ఇందులో సౌందర్యం ప్రసక్తే ఉండదు''

''ఆ సంగతి నాకూ తెలుసోయ్. వాళ్ళు రాయించుకునేది తమ అంగసౌందర్యం గురించి'' అని కాస్త ఆగి, ''ఆయా అంగాలమీదే సిరాతో'' అంది గిరిజాదేవి కళ్లు మెరుస్తుంటే.

''అంటే మీదంతా?'' అన్నాను సంభ్రమంతో.

''వాళ్లల్లో నేనున్నానని నీకు చెప్పలేదే?'' అంది గిరిజాదేవి కొంటెగా.

పై పెదవి ముందుకి తోసి నవ్వుతూంటే దశావతారాల్లో ముందుది జ్ఞప్తికి వచ్చింది.

''మొదట నేనూ నమ్మలేదు. కానీ మంజులత తన కవిత్వం చూపేసరికి నమ్మక తప్పలేదు''

''ఎలా? సిరాకడిగితే పోతుందే? ఎన్నిరోజులు అభ్యంగన స్నానం చేయలేదు?'' అన్నాను హేళనగా.

ఎందుకో నాకీ సంభాషణ ఏహ్యం పుట్టించింది. పూర్వం మారాజులు రాజ్యాలేలే రోజుల్లో కవులని నిర్బంధించి రాజనర్తకి మీదో, సరదాపడితే తమ రాణులమీదో కవిత్వం రాయించడం అందరికీ విశదమే. ఇప్పుడు రాజ్యాలు లేవు. అటువంటి పోషకులూ లేరు. నా వ్యక్తిగత సాహిత్యసేవ కవి సమ్మేళనాలకే పరిమితం. స్త్రీలని నెత్తిమీదకెక్కించుకునే స్థాయికి నేను దిగజారలేదు. ఎవరిస్థానంలో వారినుంచడం అన్నివిధాలా శ్రేయస్కరం.

''మీ మహిళలకి వెయ్యి వ్యాపకాలు. వినోదించండి. నేను వెళ్లాలి'' అని లేచాను.

''కవిత చూడవా?'' అన్న గిరిజాదేవి ప్రశ్న నన్ను తిరిగి పరుపుమీద కూర్చుండపెట్టేసింది.

''ఎలా చూపగలవు? సిరా చెరగిపోలేదా?'' అన్నాను.

''భద్రపరచడానికి పద్ధతులున్నాయిలే. ఉండు తీసుకొస్తా'' అని పడగ్గది నానుకున్న ఇంకో గదిలోకి వెళ్ళి కొద్దినిముషాల తర్వాత గునగుననడుచుకుంటూ వచ్చి,

''ఇది చూడు సింహం' అంటూ నాకో ఛాయా చిత్రం చూపించింది.

దివాను మీద తల వెనక్కి వాల్చి కూర్చుని, పల్చనిచీర, గులాబీరంగు మీద నీలం పూలున్నది కట్టుకుని ఉంది గిరిజాదేవే! ఆ స్త్రీలలో తనూ ఉందన్న నా ఊహ నిజమే.

''ఏమిటిందులో విశేషం? సాధారణ చిత్రమేనే!'' అన్నాను నాకేమీ గోచరించక.

''పరిశీలించి చూడు సింహం. చీరపొరల్లోంచి కనిపిస్తున్న నడుం పైభాగం మీదేముందో'' అంది.

ఆమె నోటి నుండి చిన్న తడి జారడం గమనించాను.

నిఘాగా దృష్టి నిలిపి చూపాను. చీరమీద నీలం పువ్వుల్లా కనిపిస్తున్నవి అక్షరాలు. అత్యంత నైపుణ్యంతో శరీరం మీద దుస్తులలో ఒక భాగమా అన్నట్టు దిద్ది ఉన్నాయి.

కళ్ళెత్తి గిరిజాదేవి వంక చూశాను.

చాలా అక్షరాలే పట్టి ఉంటాయి.

''విశదీకరించు, పద్ధతులేమిటో'' అన్నాను.

''ఏముంది కవిత రాశాక చీర కట్టుకుని ఈ చిత్రం తీయించుకుంటాం. వెలుగు నీడల ప్రభావం వల్ల అసలు సంగతి ఎవరికీ తెలియదు'' అంది గిరిజాదేవి అరమోడ్పు కన్నులతో.

''రెండో పురుషుని ప్రమేయం కూడ ఉందన్న మాట ఈ చిత్రనిర్మాణంలో'' అన్నాను.

ఈ స్త్రీలు దేనికైనా సిద్ధమే.

''ఊరుకో సింహం. అమర్‌దీప్ ఛాయాచిత్రాలు తీయడంలో కూడా నిపుణుడే'' అంది గోముగా.

''సరేలే చూసానుగా. నేను వెళ్తాను''అని లేచిపోయాను.

నన్ను ద్వారం దాకా వెళ్లనిచ్చి''అన్నట్టు మధుమిత నీ గురించి ఏమందో చెప్పలే లేదు కదూ!'' అంది.

నా పాదాలు ద్వారం దాటలేదు. వెనక్కి తిరిగి ''ఏమంది?'' అన్నాను. నా బుగ్గలు కొంచెం ఎర్రబడ్డం గమనించి, ''రా సింహం కూర్చో. చెప్తాను'' అంది తనపక్కన పరుపుపై తడుతూ.

గత్యంతరం లేక మళ్లీ వెళ్లి కూచున్నాను.

''బ్రహ్మచారి గారికి ఆఖరికి మనసుకి నచ్చిన మగువ లభించనట్లుందే!'' అంది కళ్ళు చిట్లించి.

''అర్థం లేకుండా మాట్లాడకు. మీ అందరిలాగే మధుమితానూ. అయినా ఏమందిటా?'' అన్నాను ఆత్రుతని అణచివేసే ప్రయత్నం చేస్తూ.

''అలాకాదులే. మధుమిత నాకంతా చెప్పింది. మాస్త్రీలలో రహస్యాలుండవు'' అంది నన్ను క్రీగంట చూస్తూ.

''సరే చెప్పింది కదా. నాకెందుకు తిరిగి చెప్పడం? నీదగ్గరే ఉంచుకో ఆ సమాచారం'' అని మళ్ళీ లేవబోయాను. గిరిజాదేవితో ఎలా వ్యవహరించాలో నాకు బాగా తెలుసు.

''నీకు ఉపయోగపడుతుందేమోననీ...'' అంది నామీద చూపు నిలిపి.

''చెప్పు'జా' అన్నాను. ఆమె చెయ్యి నాచేతిలోకి తీసుకుంటూ. ఇదింకో పద్ధతి. యవ్వనంలో గిరిజాదేవి కాస్త అందంగా ఉన్నప్పుడూ, చేరువ సమయాల్లోనూ అలా సంబోధిస్తే ఉబ్బితబ్బిబ్బయ్యేది. ఇప్పుడూ అదేవిధంగా స్పందించింది.

''మధుమిత అన్నిటా చాలా చక్కనిది. అందంలోనూ, గుణగణాల్లోనూ ఆమెకి సరితూగేవారు మా మహిళాసంఘంలో లేరు. కానీ అప్పుడప్పుడు విచిత్రంగా మాట్లాడుతుంది'' అని ఆగింది.

స్వేదబిందువులు నా నుదుటి మీద నుంచి జారసాగాయి. ''ఏమంటుంది?'' అన్నాను.

''ఏదో సరదాకని ఉంటుందిలే'' అంది గిరిజాదేవి మాటదాటవేస్తూ.

''ఏమిటందో చెప్పు'' అన్నాను వళ్లంతా చెమటలు పట్టేస్తూంటే.

నా స్వరంలోని దృఢత్వం అర్థమయి, గిరిజాదేవి ''అదే నీతో గడిపే ప్రతిదినం , ప్రతిక్షణం, ఒకే మాదిరిగా నిస్సారంగా, మార్పు లేకుండా ఉంటాయనీ. ఈ జీవితం అంటే విసుగేస్తోందనీ...'' అని మళ్ళీ ఆగింది.

''ఊ...ఇంకా...'' అన్నాను వణుకుతున్న స్వరంతో.

''నువ్వు చూపే ఆదరాభిమానాలని తృణీకరించలేకపోతున్నాననీ అలాగని అంగీకరించలేకనూ పోతున్నాననీ నీ చర్యలన్నీ ముందే ఊహించవచ్చుననీ, కొత్తదనం అంటూ అసలుండదనీ ఇలా ఇంకా ఏవేవో అందిలే. మమ్మల్ని నవ్వించడానికి ఇవన్నీ చెప్తోందనుకున్నాం''

''నీ ఒక్కదానితో కాదా ఇదంతా చెప్పిందీ?'' అన్నాను. నా ఒళ్లంతా వేడెక్కిపోయింది.

స్పృహ తప్పినట్లయి శరీరం పూర్తిగా వశం కోల్పోయింది.

''సింహం! సింహం! ఉద్రేకపడకు. తమాషాగా ఆడవాళ్లం ఎన్నో అనుకుంటాం. వాటికి ప్రాముఖ్యత ఇవ్వనవసరం లేదు'' గిరిజాదేవి నాకింకా దగ్గరకి జరిగి అనునయంగా నాతొడమీద చేయేసింది. ఆ పైన ఎన్నో విధాల నన్నూరడించింది. ఇంటికెలా ఎప్పుడు చేరుతున్నానో నాకు జ్ఞాపకం లేదు. నా మనసంతా మధుమిత మీద ద్వేషభావంతో రగిలిపోయింది.

0 0 0

మర్నాడు ఉదయం లేస్తూనే నీరసంగానూ, సర్వాంగాలూ సడలిపోయినట్టూ అనిపించింది. రాత్రి జరిగిన సంగతులు తలపునకు తెచ్చుకుని ప్రయత్నం చేసినప్పుడు గిరిజాదేవి ఓదార్పు స్పర్శలూ, ఉపశమన చర్యలూ ఏవో లీలగా కళ్ల ముందు కదలాడాయి. వీటన్నిటి మధ్య నా మధుమిత నా గురించి అన్నవాక్యాలు స్పష్టంగా వినిపించసాగాయి. ఒక్కసారి మళ్లీ నాలో ద్వేషం, ప్రతీకారం చోటుచేసుకుని శరీరం దహించుకుపోసాగింది. నా ఆలోచలన్నీ మధుమితని అంతం చేయడానికి మార్గాలు వెదకడానికే పరిమితం అయిపోయాయి.

కోపాగ్నిలో రగిలిపోతున్న నేను ఒక హంతకుడిలా తప్ప ఇంకోరకంగా ఆలోచించలేకపోయాను. కానీ కొద్దిసేపటికి నాకో నిజం తోచింది. మధుమితని చంపివేయడంలాంటి సులువైన పరిష్కారంతో నా ప్రతీకారజ్వాల చల్లారదే! ఆమెని అంతకన్నా ఎంతో తీవ్రమైన వేదనకి గురిచేయాలి. అందుకన్నైనా బుద్ధికుశలతని యావత్తూ ఉపయోగించి ఇంకా సూక్ష్మమైన భేదోపాయం కనిపెట్టాలి. ఉపాయం అనడం కన్నా కుట్ర అనడమే సమంజసం.

ఈవిధంగా పరిపరివిధాల మనసులో ఆలోచనలు మెదులుతూంటే వాటినుంచి ఒక అమోఘమైన పథకం రూపుదిద్దుకుంది. దిగ్గునలేచి, పక్కనే ఉన్న టెలిఫోన్ తీసి అమర్‌దీప్‌కి ఫోన్ చేశాను.

'ఒకసారి మా ఇంటికి రాగలరా?' అనగానే వెంటనే ఒప్పుకున్నాడు. సంఘంలో నాకున్న పేరు ప్రతిష్ఠలూ, కళాకారులకి నేనిచ్చే ప్రోత్సాహం వీటిగురించి విని ఉంటాడు. నా ప్రాపు సంపాదించడానికి కొద్దిగా ఉవ్విళ్ళూరుతున్నట్టనిపించింది.

అన్నీ అనుకున్నట్లు జరిగిపోతూంటే నా ఒంట్లో నిస్సత్తువ వదిలిపోయి దా స్థానే ఒక గగుర్పాటు చోటుచేసుకుంది. అమర్‌దీప్ రాకకై సన్నద్ధమవుతూ స్నానపానాదులు ఆచరిస్తూ చేతులు ఒకదానికొకటి రుద్దుకుంటూ హుషారుగా ఈల కూడా వేసేశాను. వ్యాయామం చేస్తూ ఉత్సాహం అధికం అయి తివాసీ మీద బోర్లాపడిపోయి అక్కడే చతికిలపడి చిన్నపిల్లాడిలా ఎంతోసేపు నవ్వుకుంటూ కూర్చున్నాను.

0 0 0

నిర్ణీత సమయానికి అమర్‌దీప్ రానే వచ్చాడు. గుర్తింపు పొందిన అతిశయం ఒకింత అతని వైఖరిలో ప్రతిబింబించింది. గడ్డం, ఆమధ్యలో తడిసినట్లున్న దళసరి పెదవులూ, అతని సాధారణ రూపానికి ఒక ప్రత్యేక హుందా తెచ్చిపెట్టాయి.


''రండి, అమర్‌దీప్! నా అభ్యర్థన మన్నించి వెంటనే వచ్చినందుకు చాలా సంతోషం'' అంటూ ఆహ్వానించాను.

''మీవంటి కళారాధకుల వద్ద నుండి పిలుపు అందుకోవడం మాకూ ఎంతో సంతోషం'' అన్నాడు మర్యాదగా.

'మా'కూ అనడంలో రాజసం ఉట్టిపడింది. జాగ్రత్తగా వ్యవహరించాలితనితో అనుకున్నాను. ఇద్దరం ఆసీనులమయ్యాం.

''అమర్‌దీప్ నేను మీతో చర్చించబోయే విషయం బహు సున్నితమైంది. గోప్యంగా ఉంచగలరని నమ్ముతున్నాను'' అన్నాను కుర్చీలో ముందుకి జరిగి.

''చెప్పండి నృసింహ భూపతి'' అన్నాడు అలాగే



కూర్చుని. తలమాత్రం పక్కకి వంచి. కళ్ళు తీక్షణంగా నావైపే చూస్తున్నాయి.

''కవిత్వం రాయడంలో మీరు కొత్త పంథానొకటి అనుసరిస్తున్నారని నాకు తెలియవచ్చింది. కళలని అమితంగా ప్రేమించే నాకు అంత గాఢంగానూ వాటిని ప్రేమిస్తూ అన్నికోణాల్లోనూ పరిశీలించి వాటి అందచందాలు అర్థం చేసుకునే ప్రతిభ గల ఒక స్త్రీతో పరిచయం ఉంది. ఆమె అంటే నాకు విపరీతమైన అభిమానం. ఈ సంగతి ఆమెతో సర్వసాధారణంగా మాటల ద్వారా తెలియచెప్పడం నాకెంత మాత్రమూ రుచించదు. ఒక నవ్య నూతన పద్ధతిను పయోగించి నాప్రశంసలామెకి అందజేయాలని సంకల్పించి ఇందులో మీ సహకారం ఆశిస్తున్నాను'' ఆగి అమర్‌దీప్ వైపు అర్థింపుగా చూశాను.


అతను చూపులోని తీక్షణత ఏమాత్రం తగ్గించకుండా 'చెప్పండి' అన్నట్లు చూశాడు. నేను జాగ్రత్తగా పదాలు సమకూర్చుకుని చెప్పసాగాను.

''మీరవలంభిస్తున్న ప్రత్యేక పద్ధతిలో ఆమె మీద కవిత రాసి ఆ చిత్రాన్ని నాకందజేయాలి. ఆ చిత్రాన్ని నేను కోరుతున్నట్లు ఆమెకి తెలియరాదు. ఆమెకే కాదు ఇతరులెవ్వరికీ కూడా. తద్వారా వచ్చే చిక్కులెలా ఉంటాయో నేను మీకు వివరించనక్కర్లేదనుకుంటాను. ఎంత ధనవ్యయానికీ నేను వెనుకాడను. చిత్రం మటుకు కావాలి. సాధ్యమేనంటారా?''

''ఎందుకు సాధ్యం కాదు రాజా!'' అన్నాడు అమర్‌దీప్ చిరునవ్వుతో.

'మీద' అని నేను నొక్కి అన్న పదం అతని సునిశిత అవగాహనకి అందిందని నాకర్థమైంది. ధనం ప్రసక్తి ఎప్పుడయితే ప్రస్తావించానో అతని కళ్లల్లో తీక్షణత తగ్గింది. రాజసం స్థానంలో వినమ్రత కనిపించింది.

'వయసు మీరిన నావంటి కళారాధకులకి కొన్ని సమయాల్లో తరుణీ వ్యామోహం కలుగుతూ ఉంటుంది. మీ ద్వారా ఈ విషయం సున్నితంగా తెలియజెప్పగలిగే శుభసమయం ఆసన్నమైనట్లు




తెలుస్తోంది. అన్ని పక్షులనూ స్వేచ్ఛగా విహరించనీయకూడదు. కొన్ని అపురూపమైన పంచరంగుల చిలకలను చిత్రపంజరాల్లో బంధించి ఉంచాలి. ఏమంటారు?'' అన్నాను. ఈ సారి నాకళ్ళు తీక్షణమైనాయి.

''ఆ...ఆ...అంతే!'' అన్నాడు అమర్‌దీప్ చిన్నగా భృకుటి ముడుస్తూ. నా ఉపమానం అతనికి లేశమాత్రమైనా అర్థమై ఉండదు. కానీ ధనాశ ఎటువంటి పనులనైనా సులువుగా నెరవేరేటట్లు చేయగలదని నాకర్థమైంది.

''మధుమితతో మీకు పరిచయం ఉందా?'' అనడిగాను.

కాస్త ఆలోచించి ''ఏమో చూసే ఉంటాను. వాకబు చేయాలి. మహిళా సంఘం వారినడిగితే తెలుస్తుంది'' అన్నాడు.

''మీ వంగదేశపు వేడుకలు ఏవో జరగబోతున్నట్టున్నాయి ఈనెలలో? మధుమిత తప్పక హాజరవుతుంది. మీరు రచించబోయే కవితకి అదే గీయబోయే చిత్రానికి ఆమెని మించిన సౌందర్యవతి ఉండబోదనీ, ఆ చిత్రాన్ని రాబోయే సాంస్కృతిక ఉత్సవాల్లో ప్రదర్శించడానికి ఉబలాటపడుతున్నారనీ చెప్పి ఆమె అంగీకారం పొందండి. మీవంటి ప్రసిద్ధ కళాకారుడు ఇంతమందిలో తననే ఎంపికచేసినందుకు గర్వపడి సమ్మతిస్తుంది. నా పేరెక్కడా పైకి పొక్కకూడదు సుమా! చిత్రం ప్రదర్శించాక నాకు తెచ్చి ఇవ్వాలి''

అమర్‌దీప్ కళ్లల్లో చిన్న సంశయం పొడచూపింది.

''ఇందులో ప్రమాదం ఏమీ లేదు అమర్‌దీప్. ఒక వృద్ధుని వినోదం అనుకోండి. అవసరమైతే రెట్టింపు ధర తీసుకోండి'' అన్నాను.

ఆమాటతో అమర్‌దీప్ కళ్లు విశాలమై కుర్చీలో వెనక్కి జారబడి చిరునవ్వు నవ్వాడు.

ఆ నవ్వుని అంగీకారంగా తీసుకుని ఒకో వివరణ చేశాను.

''పూర్తిగా శిరస్సు నుంచి పాదాలవరకూ కనబడేటట్లు వయ్యారంగా నిలబడిన భంగిమ గీయండి'' అన్నాను.

అమర్‌దీప్ తలాడించి వెళ్లడానికి లేచాడు.

''నాకంతా అర్థమైంది భూపతిరాజా! ఒక అద్భుత సౌందర్యవతిని చిత్రించే అవకాశం అరుదుగా లభిస్తుంది. మీకోరిక నెరవేర్చే బాధ్యత నాది. మీరు నిశ్చింతగా ఉండవచ్చు''

అతని పెదాలు కొద్దిగా తడవడం గుబురు గెడ్డంలోంచి కనిపించింది.

''ఈ విషయం మనిద్దరి మధ్యలోనే ఉండాలి సుమా!'' అని మళ్లీ హెచ్చరించాను.

అమర్‌దీప్ చివరిసారిగా చిరునవ్వు నవ్వి నిష్క్రమించాడు. అతన్ని సాగనంపి లోనికి వచ్చి ముప్ఫై సార్లు శ్వాస మెల్లిగా పీల్చి బయటకు వదిలాను. సోఫాల మీద, కుర్చీల మీద పైకీ కిందికీ దూకి గంతులెయ్యకుండా ఆపే పద్ధతి ఇంకేదీ నాకప్పుడు స్ఫురించలేదు. అంత పరమానందం నేనెన్నడూ అనుభవించి ఎరుగను. నా పన్నాగం పారుతోంది. అతిక్లిష్టమైన భాగం పూర్తి అయింది. మిగిలిన దానికోసం నిరీక్షించాలి. చిత్రం నా చేతికి వచ్చేసరికి కనీసం రెండు మాసాలైనా పడుతుంది. ఆ సమయంలో నేను ఇక్కడ అందరికీ అందుబాటులో ఉండకూడదు.

ఈ ఆలోచన రాగానే వెంటనే పారిస్‌లో నా స్నేహితులని సందర్శించడానికి ఏర్పాట్లు చేసుకున్నాను.

నా పథకానికి అవసరమైన సామగ్రి కూడా పారిస్‌లోనే లభ్యమవుతుంది. బయలుదేరేముందు మధుమితకి సందేశం పంపాను ''కొద్దిరోజులు ఆమెని కలవడానికి వీలవదనీ, ముఖ్యమైన కార్యం నిర్వర్తించడానికి పారిస్ వెళుతున్నాననీ''

0 0 0

పారిస్‌లో ఉన్న నలభైరోజులూ ముళ్లమీదున్నట్లు గడిపాను. నాలో ఒకటే అసహనం. నా పథకం ఇక్కడ ఎలా సాగుతోందా అని. తిరిగి వచ్చిన మరుక్షణం అమర్‌దీప్‌తో సంభాషించాను. అనుకున్నట్లే ప్రదర్శనలో మధుమిత చిత్రం ఇతర చిత్రాలతో పాటూ చూపబడిందనీ, అంతా ఈ చిత్రాన్ని ఎంతో ప్రశంసించి తనని పొగడ్తలతో ముంచెత్తుతున్నారనీ, కొందరు విదేశీయులు చిత్రం కొనడానికి ఉత్సుకత చూపుతున్నారనీ కానీ అది విక్రయానికి కాదని అన్నాననీ, ధర చాలా పలుకుతోందనీ... ఇలా ఏవేవో చెప్పుకొచ్చాడు. ప్రదర్శన ఇంకోవారం ఉందనీ వస్తారా అనీ అడిగాడు.

నేను వెళ్లలేదు. చిత్రం ప్రదర్శన పూర్వవగానే నాకు చేర్చేయమన్నాను.

చిత్రం నాకు అందించగానే అమర్‌దీప్‌కి ఇవ్వాల్సిన మొత్తం కన్నా ఎన్నో రెట్లు ముట్టచెప్పేసరికి అతని సంతోషానికి హద్దులు లేకపోయాయి. తన అవసరం ఎప్పుడు కలిగినా పిలవడానికి సంశయించవద్దన్నాడు. 'మీవంటివారి అభిరుచులు క్షణ క్షణం మారుతూనే ఉంటాయి'' అని నర్మగర్భంగా చిరునవ్వు నవ్వాడు. నాకళ్లల్లో ఏ భావం ప్రకటించకుండా

నేను చిరునవ్వుతో అతన్ని సాగనంపాను.

0 0 0

అమర్‌దీప్ వెళ్లగానే చిత్రాన్ని మేడమీద నా అంతరంగిక స్టూడియోకి తరలించి అక్కడ దానిని క్షుణ్ణంగా పరిశీలించాను. నేను కోరినట్లే మధుమిత తెల్లచీర కట్టుకుని ఒక పాదం కాస్త ముందుకి జరిపి వయ్యారంగా నిలబడి ఉంది. చీరంతా బంగారుతీగ లతో పువ్వులు కుట్టబడి ఉన్నాయి. అవి చూసి నవ్వు కున్నాను.

పైన నేనమర్చుకున్న ఈ గదిలో నా ఏకాగ్రతని ఎవరూ భంగపరచలేరు. అనువైన ఈ ప్రదేశంలో చిత్రాన్ని మార్చడానికి పూనుకున్నాను. గిరిజాదేవికి అవగాహనకందని విషయం ఏంటంటే చిత్రాన్ని పెద్దగా ఎన్‌లార్జ్ చేస్తే రాసిన అక్షరాలు స్పష్టంగా కన పడతాయి. కవితా, అవయవాలూ, అన్నీ ప్రస్ఫుటం అవుతాయి.

పారిస్ నుంచి తెచ్చిన అత్యాధునిక పరికరాలతో చిత్రాన్ని ముందు ఫొటో తీశాను. దానిని డార్క్ రూంలో పదింతలు పెద్దదిగా డెవలప్ చేశాను. దాదాపు పదడుగులు పెరిగి నేలనుంచి పైకప్పు వరకూ గోడనాక్రమించింది. ఎలా ఉందో చూద్దా మని వెనక్కి ఒక అడుగు వేశాను. నా ఆశ్చర్యానందా లకి హద్దులేకపోయాయి. అమర్‌దీప్ చిత్రాన్ని బాగా గీయగలడనే అనుకున్నాను. కానీ ఇంత జీవకళ ఉట్టి పడేటట్లు చిత్రిస్తాడని ఊహించలేదు. మధుమితలో నున్న ప్రతి ఒంపూ, నునుపూ యధాతథంగా కాన్వాస్ మీదకి దింపేశాడు. బంగారు పూవులూ, తీగలుగానూ చిత్రీకరించబడిన కవితలోని వాక్యాలు ఆ ఒంపుసొంపుల్లో ఇమిడిపోయి ఆయా అంగాలని ఎంతో అందంగా వర్ణించాయి.

'పయోధర్మములు' అని ఒకచోట స్పష్టంగా కని పించింది.

'అమర్‌దీప్ చవకబారు కవిత్వం రాయడు. భాషమీద మంచి పట్టే ఉంది' అనుకున్నాను. నన్నె క్కువగా కలవరపరిచినది మధుమిత విలాసంగా నిలబడిన తీరు. ఒక పురుషుడి ముందు నగ్నంగా నిలబడి ఉన్నానే అన్న సంకోచం లేశమాత్రమైనా కన పరచకుండా తలకొద్దిగా వంచి కనులు పైకెత్తి చూస్తున్న మధుమిత రంగురంగుల దీపాల గుత్తి వెలుగులు వెదజల్లుతూంటే ఇటువంటి అత్యంత సన్నిహిత భంగిమలో చిత్రం గీయించుకున్న ఈ మధుమిత లజ్జా బిడియాల వల్లనే తన శరీరలా వణ్యం నాకు చూపకుండా తాకనీయకుండా పదిలప రుచుకుంటుందనుకున్న నా భ్రమ పటాపంచలైంది. నా ద్వేషం ద్విగుణీకృతం అయింది.

మళ్లీ దృఢ నిశ్చయుడనై లేచాను. ఇక ఆహ్వా నాలు పంపాలి. మొట్టమొదటిది మధుమితకే. ఆమెకే విధమైన అనుమానం రాకుండా అత్యంత శ్రద్ధను పయోగించి పదాలు కూర్చాను.

''నిన్ను చూడక ఎంతకాలం గడిచిపోయింది? పారిస్‌లో జాప్యం కలిగింది. మళ్లీ మన కలయికకి సమయం ఆసన్నమైంది. తప్పక విందుకి రాగ లవు....'' ఇలా సాగింది నా ఆహ్వానపత్రిక. తరువాత గిరిజాదేవికీ, మిగతా నా ఆప్తమిత్రులకీ కొద్దిపాటి మార్పులతో ఆహ్వానాలు పంపి వేశాను.

అంతా హాజరై తీరుతాను. భూపతిరాజా విందాయె! కాదనరు. 'భూపతి నిన్నూ పిలిచాడా? అయితే నేనూ తప్పక వస్తాను. 'సింహం ఎంతో ఉన్నతుడూ, సౌమ్యుడూనూ. వెళ్లకపోతే నొచ్చుకుం టాడు'. ఆహ్వానాలందుకుని ఈవిధంగా ఒకరినొకరు సంప్రదించుకుంటారు.

ఊహూ... ఇలా ఉండదు.

ఈసారి–

''ఇస్! మళ్లీ భూపతి ఎందుకు పిల్చాడు. అతని విందు భోజనం తిన్న వారు స్వర్గానికి బెత్తెడు దూరంలో ఉంటారు. కానీ మానవుడు తనో మేధావి ననుకుంటాడే అక్కడే పొరబడతాడు. అతన్ని మించిన మందబుద్ధి ఈ ప్రాంతాలకనబడడు. చెప్పిందే చెప్పి చేసిందే చేసీ...కావాలంటే మధుమిత తనడుగు. చక్కగా వర్ణించి చెప్తుంది. ఎలా భరి స్తోందో పాపం!''

ఇలా సాగి ఉంటుంది వారి సంభాషణ.

ఎవరే విధంగా అనుకున్నా నా ఆతిథ్యం స్వీక రించి సరైన సమయానికి విందుకి అంతా హాజర య్యారు.

విందుభోజనాలు డాబా మీద అమర్చాను. అంతాపైకి చేరి ''ఆ..హ్! ఎంత అద్భుతం.. నక్షత్రాలు ప్రసరించే వెలుగింత కాంతిమయం ఉంటుందని తెలి యనే లేదు. భూపతీ! భావుకుడివంటే నువ్వేనోయ్!'' అంటూ తెగమెచ్చుకున్నారు. చిరునవ్వుతో పొగడ్తలు వింటున్న నా వద్దకు మధుమిత వచ్చి నా చేయి మృదువుగా తాకి 'సింహం' అంది గోముగా.

ఆమె చేయి మెల్లగా విడిపించుకుని మెట్లకి దూరంగా జరిగాను. పరిచారకులు పానీయాలు అతి థులకి అందజేస్తున్నారు. మధుమిత ఒక పాత్ర అందుకుని చేతిలో దాన్ని అలవోకగా పట్టుకుని గిరి జాదేవితో అంటోంది ''పారిస్‌లో ఏముంది? ఫ్రెంచి పురుషులూ, మద్యం తప్ప. మనభూపతిరాజా ఇంట్లో దొరికే ఈ పానీయం అక్కడ లభిస్తుందా?'' గిరిజాదేవి కళ్లు చిట్లించి పై పెదవి ముందుకి తోసి మధుమిత మాటలు శ్రద్ధగా వింటోంది.

ఇదే సరైన సమయమని మెట్ల పక్కనున్న మీట నొక్కాను. ఒక్కసారి వేయి సూర్యుళ్ల వెలుగు ప్రసరిం చినట్లు నేను గోడకి అమర్చిన రంగుల దీపాల గుత్తి వెలిగింది. ఆ వెలుగుకి కళ్ళు జిగేల్‌మనగా అంతా ఒక్కసారి కళ్ళు మూసి తెరచి చుట్టూ చూశారు.

నేను మెట్ల పక్క నీడలో నక్కి నిలబడ్డాను. మధుమిత చెంపకి చెయ్యానించి కళ్లు విప్పార్చి, వెలు గులో గోడంతా ఆక్రమించి నిలువుకి తగిలించి ఉన్న చిత్రాన్ని చూసి నిశ్చేష్ట అయిపోయింది. పూర్తి సంతృ ప్తితో ఆమెనొకసారి పరికించి మెట్లు దిగి కిందకి వెళ్లి పోయాను.

పైనుంచి మాటలు వినిపిస్తున్నాయి.

''ఎవరక్కడ! కాసిని నీరు తీసుకురండి. ఏదీ ఆ పానీయం! జల్లండి. జల్లండి మధూ! లే! లే!.... మధూ....! లోలోన నవ్వుకుంటూ కారుతీసి ఊరి చివర నా బంగళాకి వెళ్లిపోయాను.

మరుసటి రెండ్రోజులూ మేఘాల్లో తేలిపో యాను. నేను చేసిన పని నాకే ఎంతో నచ్చి ఉల్లా సంతో మనసెగసి పడింది.

ఇంటికి తిరిగి వచ్చిన మూడోరోజు గిరిజాదేవి ఫోన్ చేశాక కానీ నేననుభవిస్తున్న మానసికల్లోసానికి స్వస్తి పలకలేకపోయాను.

''సింహం! నువ్వేదో ఘనకార్యం చేసానని సంబ రపడిపోతున్నావేమో! నీ స్నేహితులెవరూ ఈపనిని హర్షించడం లేదు. అంతా నిన్ను వెలివేసేయాలని నిశ్చయించుకున్నారు. నేను కాదులే! ఈ సమ యంలో నీకు ఓదార్పునిచ్చి ఉపశమనం కలిగించడా నికి ప్రాణస్నేహితురాలిని నేను మిగిలున్నానని తెలు సుకో. నేను నీదగ్గరకొచ్చి కొన్నాళ్ళు గడిపితే అన్నీ సర్దుకుపోతాయి. ఏం?'' ఇలా ఏదేదో వాగుతున్న గిరిజాదేవి మాటలేవీ నా చెవిలోకి జారబడలేదు.

ఒక్కసారిగా నేను చేసిన క్రూరకర్మ ప్రభావం నామీదే పడింది. ఫోను కిందపెట్టేసి పైకి వెళ్లి పక్క మీద పడి వెక్కివెక్కి రోదించాను.

అలా నాలుగురోజులు ఏకధాటిగా కన్నీరుము న్నీరుగా విలపించాను.

అయిదోరోజు నా మనసుకి తగిలిన అసలు అఘాతం తేనెకన్నా తీయని పలుకులతో కూర్చబడి మృదుత్వంతో నిండి తన కోమలహస్తాలతో రాసి మధుమిత నాకు పంపిన సందేశం. నాగుండెలోతు ల్లోకి చొచ్చుకుపోయి నన్ను పశ్చాత్తాపంతో నింపి వేసిన జాబు.

''ఇటువంటివి జరుగుతూనే ఉంటాయి సింహం. సన్నిహితుల మధ్య జరిగే చిన్న చిన్న కవ్విం పులివి. అంతే! నేను పట్టించుకున్నాననుకున్నావా! అందరూ నీ గురించి అంటున్న మాటలు కేవలం అసూయ వల్ల ప్రేరేపించబడినవే. నేనెన్నటికీ నీదా నినే సింహం! ఎప్పటికీ''

చదువుతూ ఉంటే మళ్లీ నా కండ్ల వెంట ధారా పాతంగా కన్నీరు ప్రవహించసాగింది. నాకన్నా దురా త్ముడు ఈ భూప్రపంచంలో ఎక్కడా ఉండడు. నేనింత కిరాతకంగా ఎలా ప్రవర్తించగలిగాను? నాలాంటి వారికి నిష్కృతి ఉంటుందా?

సందేశంతో పాటూ మధుమిత చిన్న పింగాణీ పాత్రలో నాకత్యంత ప్రియమైన పాయసం పంపింది. అంత మనోవ్యధలోనూ అందులోని ఘాటైన యాల కుల పరిమళం నాసికకి సోకి ఇక ఆగలేక కళ్లు తుడు చుకుని పాయసం తినడం ప్రారంభించాను. కాస్త తినగానే మళ్లీ హృదయంలో అలజడి కలిగి పక్కన పెట్టేసి తర్వాత తినవచ్చులే అనుకున్నాను. కానీ క్షణ క్షణానికీ అధికమవుతున్న ఈ కలవరం కేవలం మధు మితకి నేను కలిగించిన మానసిక సంక్షోభం కారణం గానే అంటారా?

✱